**విలేఖరులు కావలెను**

తెలుగు రాష్ట్రాలలో లక్షలాది మంది పాఠకుల అభిమానాన్ని చూరగొంటున్న 'సూర్య ప్రభ' ఈ-పేపర్‌లో పని చేయుటకు జిల్లా, నియోజకవర్గాలు, మండలాల వారీగా విలేఖరులు కావలెను. ఆసక్తి గల అభ్యర్థులు సంప్రదించగలరు.

**ఫోన్ - 8985829417**



# సూర్య ప్రభ

తెలుగు జాతీయ దిన పత్రిక

సంపుటి : 2 సంచిక: 6 | ఎడిటర్ : ఇ.సంజీవరెడ్డి | మంగళవారం, జులై 1 2025 | పేజీలు : 4





## ఎవరూ ఊహించని విధంగా...

# నాగపూర్ నిర్ణయం మేరకే...

## తెలుగు రాష్టాలకు బీజేపీ కొత్త సారథులు!

## ఆంధ్రాకు మాధవ్ - తెలంగాణకు రామచంద్రరావు

ఉభయ తెలుగు రాష్ట్రాలకు బీజేపీ నూతన అధ్యక్షులు ఎవరో తేలిపోయింది? ఇంతవరకు అనేక కోణాల్లో, అనేక సమీకరణలు ఆధారంగా లెక్కలు కట్టిన కమల దళం చివరకు నాగపూర్ ఎంపిక చేసిన పాత కాపులకే పట్టం కట్టింది.

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి మాజీ ఎమ్మెల్సీ పీవీ మాధవ్, తెలంగాణకు మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు పేర్లను, బీజేపీ అధిష్టానం ఖరారు చేసింది. ఈ మేరకు ఇద్దరు నేతలకు అధిస్ఠానం నుంచి ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది. నిజానికి.. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో బీజేపీ అధ్యక్ష పదవి కోసం సీనియర్ నాయకులు చాలా మంది పోటీ పడ్డారు. ఆంధ్ర ప్రదేశ్ లో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి మొదలు, పాత, కొత్త నాయకులు చాలా మందే రాష్ట్ర అధ్యక్ష పదవిని ఆశించారు. ఇక తెలంగాణలో అయితే.. చెప్పనే అక్కర లేదు. ఎంపీలు ఈటల రాజేందర్ , ధర్మపురి అరవింద్, డీకే అరుణ,మాజీ అధ్యక్షులు లక్ష్మణ్ , బండి సంజయ్ ఇలా చాలా పేర్లు తెరపైకి వచ్చాయి. ఒక దశలో ఈటల పేరు ఖరారు అయినట్లే ప్రచారం జరిగింది.. అయితే.. చివరి క్షణంలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ సంఘ్ (ఆర్ఎస్ఎస్) బ్యాక్ గ్రౌండ్ ఉన్న పీ మాధవ్, రామచంద్రరావు పేర్లను ఆదిష్ఠానం ఖరారు చేసింది. దీంతో ఇదరి ఎంపిక నాగపూర్ నిర్ణయంగా భావిస్తునారు. నిజనికి ఇద్దరూ కూడా సంఘ్ సిద్దాంత పునాదులపై ఎదిగిన నాయకులు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ, పీవీ చలపతి రావు కుమారుడు మాధవ్, బీజేపీలో సాధారణ కార్యకర్త మొదలు అనేక బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుత రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. అలాగే, రామచంద్ర రావు బాల్యం నుంచి సంఘ్ సంపర్కంలో పెరిగారు ఏబీవీపీ లో క్రియాశీలంగా పనిచేసిన ఆయన బీజేపీలో లీగల్ సెల్ బాధ్యలతో పాటుగా పార్టీ బాధ్యలు నిర్వహించారు. సోమవారం (జూన్ 30) మధ్యాన్నం 2 గంటల తర్వాత ఏపీలో మాధవ్, తెలంగాణలో రామచంద్ర రావు నామినేషన్ దాఖలు చేశారు.




పాశమైలారం: సంగారెడ్డి జిల్లా పాశమైలారం ఘటనలో మృతుల సంఖ్య 12కి చేరింది. మరో 30 మందికి పైగా గాయాలయ్యాయి. భవనం, శిథిలాల కింద మరికొందరు చిక్కుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. వెలికితీసిన మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశమున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రమాద సమయంలో పరిశ్రమలో 108 మంది కార్మికులు ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రుల్లో 12 మంది పరిస్థితి విషమంగా ఉంది. వారికి ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. సోమవారం పాశమైలారం పారిశ్రామికవాడలో భారీ పేలుడు సంభవించిన సంగతి తెలిసిందే. సిగాచి రసాయన పరిశ్రమలో రియాక్టర్ పేలడంతో మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో పలువురికి గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన వారిలో సంఘటన స్థలిలోనే ఐదుగురు మృతి చెందగా.. మరో 7 మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. పేలుడు ధాటికి కార్మికులు సుమారు 100 మీటర్ల దూరం ఎగిరిపడ్డారు. పేలుడు తీవ్రతకు ఉత్పత్తి విభాగం ఉన్న భవనం కూలిపోగా.. మరో భవనానికి బీటలు వచ్చాయి. సమాచారం అందుకున్న కార్మికుల కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలతో అక్కడి పరిస్థితి భీతావహంగా మారింది.

**వైస్ ప్రెసిడెంట్ ఎల్ఎన్ గోవన్ దుర్మరణం...** సిగాచి రసాయన పరిశ్రమలో జరిగిన పేలుడు ఘటనలో ప్లాంట్ వైస్ ప్రెసిడెంట్ ఎల్ఎన్ గోవన్ దుర్మరణం పాలయ్యారు. గోవన్ ప్లాంట్‌లోకి అడుగుపెట్టిన సమయంలోనే పేలుడు సంభవించింది. ప్రమాద ధాటికి ఆయన కారు నుజ్జునుజ్జయింది.

**సంగారెడ్డి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్...** సిగాచి ప్రమాద బాధితుల కోసం సంగారెడ్డి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ప్రమాద బాధితుల వివరాల కోసం 08455276155ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

**పరిశ్రమల భద్రతపై త్వరలో కమిటీ...** పరిశ్రమల్లో భద్రతపై త్వరలోనే ఓ కమిటీ వేస్తామని మంత్రి వివేక్ తెలిపారు. అధిక పని గంటలపై కార్మికులు ఫిర్యాదు చేస్తే లేబర్ కమిషన్ దర్యాప్తు చేస్తుందన్నారు. మరోవైపు సిగాచి పరిశ్రమ ఘటన దురదృష్టకరమని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ప్రమాదం జరిగిన తర్వాత అన్ని విభాగాల అధికారులు సత్వరమే స్పందించారని, ప్రమాదానికి గల కారణాలను ఇప్పుడే చెప్పలేమన్నారు. ఈ పరిశ్రమలో మైక్రో క్రిస్టలైన్ సెల్యులోజ్ అనే పౌడర్ తయారు చేస్తున్నట్లు చెప్పారు. గత 40 ఏళ్లుగా ఈ సంస్థ పని చేస్తోందని తెలిపారు.

## ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో సమాచార పౌర సంబంధాల శాఖది కీలక పాత్ర : ప్రత్యేక కమిషనర్ సి హెచ్ ప్రియాంక





హైదరాబాద్, జూన్ 30: ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో సమాచార పౌర సంబంధాల శాఖ కీలక పాత్ర పోషిస్తుందని I &PR ప్రత్యేక కమిషనర్ సి హెచ్ ప్రియాంక అన్నారు. సమాచార శాఖ ప్రధాన కార్యాలయంలో పౌర సంబంధాల అధికారి గా విధులు నిర్వర్తిస్తున్న ముళ్ళపూడి శ్రీనివాస్ కుమార్ సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా హైదరాబాద్ రాష్ట్ర సమాచార శాఖ కార్యాలయంలో PRO శ్రీనివాస్ కుమార్ ను కార్యాలయ అధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక కమిషనర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా నిలిచి ప్రభుత్వం చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని ప్రజలకు చేరవేసేందుకు సమాచార శాఖ అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. సమాచార శాఖ కార్యాలయంలో PRO ముళ్ళపూడి శ్రీనివాస్ కుమార్ తమ విధులను అంకితభావంతో సమర్ధవంతంగా నిర్వర్తించారని I &PR ప్రత్యేక కమిషనర్ సి హెచ్ ప్రియాంక ప్రశంసించారు. ఉద్యోగ విరమణ మరొక కొత్త జీవితం అని అన్నారు. ఉద్యోగంలో ఉన్నప్పుడు వ్యక్తి గత జీవితాన్ని చాలా కోల్పోతామని, ఉద్యోగం విరమణ తర్వాత కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలన్నారు. అనంతరం శ్రీనివాస్ కుమార్ కుటుంబ సభ్యులను ప్రత్యేక కమిషనర్ పరిచయం చేసుకున్నారు. సమాచారశాఖ PRO ముళ్ళపూడి శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ తన 38 ఏండ్ల ఉద్యోగ జీవితం సంతృప్తిగా సాగిందన్నారు. అనేక పురస్కారాలు లభించాయన్నారు. చిత్తశుద్ధితో పని చేయడం వలన సమాచార శాఖ కు తాను చేసిన సేవల కంటే పొందినదే ఎక్కువ అని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ అదనపు సంచాలకులు డి.ఎస్. జగన్, సంయుక్త సంచాలకులు కె.వెంకట రమణ, వెంకటేశ్వరావు, ఉప సంచాలకులు మధుసూధన్, వై వెంకటేశ్వర్లు, ప్రసాద్, హాష్మీ , సమాచార శాఖ అధికారులు , ఉద్యోగులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్రంలో బిజెపి అధికారంలో రాకుండా అడ్డుకుంటున్నది ఎవరో కాదు బిజెపి కేంద్ర నాయకత్వమే?

# రాజా సింగ్ సంచలన ఆరోపణలు

**గత ఎన్నికల ముందు తెలంగాణలో బిజెపి పోటీ చేసి అధికారం కైవసం చేసుకుంటుందనుకునే సమయంలో బండి సంజయ్ ని మార్చి పార్టీ కార్యకర్తలను ప్రజలను విస్మయానికి గురిచేసింది**
**బిజెపిలో ఎందరో బలమైన నాయకులు ఉండగా పార్టీకి నష్టం కలిగే విధంగా**
**బలహీనమైన నాయకునికి రాష్ట్ర అధ్యక్ష పదవి కట్టబెట్టారని బాధతో రాజాసింగ్ రాజీనామా**
**బిఆర్ఎస్ తో పొత్తు పెట్టుకోవడానికి బలహీనమైన నాయకుడికి**
**రాష్ట్ర అధ్యక్ష పదవి కట్టబెట్టారని కార్యకర్తలు పార్టీ నాయకులు ఆక్రోషంతో ఉన్నారు**
**హిందుత్వ నినాదంతో హిందువులను మోసం చేస్తున్న బిజెపి పార్టీపై ప్రజలు ఆవేశంతో ఉన్నట్టు తెలుస్తుంది**




హైదరాబాద్ జూన్ 30: రాబోయే సాధారణ ఎన్నికల్లో ఎలాగైనా బిజెపి అధికారంలో వస్తుందని ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న ప్రజలకు నాయకులకు కేంద్ర నాయకత్వం నిరాశపరిచిందనే చెప్పాలి. తెలంగాణ రాష్ట్రంలో బిజెపి అధికారంలో వస్తుందని కార్యకర్తల్లో పార్టీ వర్గాల్లో ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న సమయంలో సత్తా లేని నాయకుడిని రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నిక చేయడం తెలంగాణ ప్రజలను తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా కేంద్ర నాయకత్వం వ్యవహరిస్తుందని రాజసింగ్ రాజీనామా చేయడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర బిజెపి పార్టీకి ఎంతో నష్టం చేకూరుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. బిఆర్ఎస్ పార్టీ గతంలో ఓడిపోయి పార్టీకి బలం లేకుండా పోయింది అందులో కవిత అరెస్టుతో పార్టీలో లుకలుకలు మొదలయ్యాయి ఇప్పుడు బిఆర్ఎస్ పార్టీలో కుటుంబ తగాదాలతో కవిత పార్టీలో సరైన ప్రాధాన్యత దొరకట్లేదని అన్నతో తండ్రితో తగువుకి దిగి తన జాగృతి ద్వారా కార్యక్రమాలను ఉదృతం చేసి కొత్త పార్టీ ఏర్పాటు చేసి రాష్ట్రంలో అధికారం కోసం ప్రయత్నాలు మొదలు పెట్టినట్టు అందరికీ తెలిసిన విషయమే ఇలా బిఆర్ఎస్ పార్టీ తన బలహీన పడిన సమయంలో అందరూ బిజెపి ఇలాగైనా రాష్ట్రంలో గెలుస్తుందని అభిప్రాయంతో ఉన్న తరుణంలో ఇలాంటి నిర్ణయం రాష్ట్ర ప్రజలకు నిరాశ కల్పించింది. తెలంగాణలో బిజెపి పార్టీ గెలిచే అవకాశాలు ఎన్నో ఉన్నా కేంద్ర నాయకత్వమే కావాలని తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో రాకుండా చేస్తుందని బిజెపి నాయకుల్లోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. నిజానికి తెలంగాణ రాష్ట్రంలో బిజెపి అధికారంలో వస్తుందా అని అనుకుంటే ప్రజల నాడి ప్రకారము ప్రజలు కసితో ఈసారి కచ్చితంగా బిజెపికి ఓటు వేసి మన హిందుత్వాన్ని నిలబెట్టుకొని మన సత్తా చాటుదామని కసితో ఉన్న తరుణంలో బలమైన నాయకులు ఎందరో ఉన్న ఒక బలహీన నాయకునికి తెలంగాణ రాష్ట్ర పగ్గాలు అతని చేతిలో పెట్టడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. రాబోయే సాధన ఎన్నికల్లో ప్రజల ఆకాంక్ష ఈసారి కూడా నెరవేరేతట్టు లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బలహీన నాయకుడిని రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నుకునే ప్రక్రియలో బిఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కేసీఆర్ పాత్ర కీలకంగా ఉన్నట్టుగా సమాచారం దానికి కారణం రాబోయే సాధారణ ఎన్నికల్లో బిజెపితో బిఆర్ఎస్ పొత్తు ఏర్పరచుకొని ఎలాగైనా కాంగ్రెస్ పార్టీని ఓడించి రెండు పార్టీల కలయికతో తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ విజయం సాధించాలని తపనతో బలహీన నాయకుడికి బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవి దక్కినట్టయితే మేము నిశ్చింతగా అధిక సీట్లు సాధించగలమనే ధీమాతోనే కెసిఆర్ చక్రం తిప్పినట్టు బిజెపి నాయకులు అనుమానాలను వ్యక్తపరుస్తున్నారు

# రేయి.. బస్సులేవీ..?

హైదరాబాద్: రూ.వందల కోట్లు ఖర్చు చేసి అత్యాధునిక హంగులతో నిర్మించినా.. చర్లపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకునేందుకు ప్రయాణికులు పాట్లు పడుతున్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనుల నేపథ్యంలో అనేక రైళ్లను చర్లపల్లికి మళ్లించడం, పలు ప్రత్యేక రైళ్లు ఇక్కడి నుంచి ప్రారంభమవుతుండటంతో రాత్రివేళ స్టేషన్ చేరుకునేందుకు చుక్కలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా రాత్రి 10 దాటితే అటువైపుగా వెళ్లే ఒక్క ఆర్టీసీ బస్సు కనిపించదు. ప్రైవేటు క్యాబ్ లేదా ఆటో కోసం వెతుక్కోవాల్సిందే. దీంతో వారు అడిగినంత ఇవ్వాల్సి వస్తోంది. చర్లపల్లి రైల్వేస్టేషన్ నుంచి నిత్యం 95 రైళ్లలో 30వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. వారి సౌకర్యం దృష్ట్యా గ్రేటర్ ఆర్టీసీ 45 బస్సులను నడుపుతోంది. రాత్రి 9.30 గంటలకే చివరి బస్సు ఉండటంతో రైళ్లను అందుకోవడం ఇబ్బందిగా మారింది. తిరుపతికి వెళ్లే కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ రాత్రి 10గంటలకు ఇక్కడి నుంచి బయలుదేరుతుంది. చర్లపల్లి తిరుపతి మధ్య నడిచే ప్రత్యేక రైలు రాత్రి 9.45 గంటలకు, నాందేడ్- విశాఖ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్



రాత్రి 9.30 గంటలకు బయలుదేరుతుంది. కాచిగూడ రేపల్లె డెల్టా ఎక్స్‌ప్రెస్ కాచిగూడ నుంచి 10.20కి బయలుదేరి.. మల్కాజిగిరి జంక్షన్ దాటి 10.52కి చర్లపల్లి స్టేషన్ చేరుకుంటుంది. ఖమ్మం వైపు వెళ్లే ప్రయాణికులు మణుగూరు ఎక్స్‌ప్రెస్ అందుకోవాలంటే రాత్రి 11.30గంటలకల్లా చర్లపల్లిస్టేషన్‌లో ఉండాలి. ఈ రైలు ఇక్కడి నుంచి 11.55కి బయలుదేరుతుంది. సనత్‌నగర్, ఫిరోజ్‌గూడ, సుచిత్రసెంటర్, భూదేవినగర్, అమ్ముగూడ, నేరేడ్‌మెట్‌వాసులు రాత్రిపూట చర్లపల్లి స్టేషన్ చేరుకునేలా ఒకే ఒక్క ఎంఎంటీఎస్ నడుపుతున్నారు.

**రాత్రి 9.30గంటల తర్వాత..**

నాందేడ్ - విశాఖపట్నం సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, చర్లపల్లి - కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్, చర్లపల్లి రాక్సాల్ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్ - దర్భంగ ఎక్స్‌ప్రెస్, డెల్టా ఎక్స్‌ప్రెస్, చర్లపల్లి పట్నా స్పెషల్, వాస్కోడిగామా వీక్లీ ఎక్స్‌ప్రెస్, నాగర్‌సోల్ నర్సాపూర్ సూపర్‌ఫాస్ట్, నాగర్‌సోల్ నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్ - మణుగూరు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, బిలాస్‌పూర్ కాచిగూడ ఎక్స్‌ప్రెస్.

# శౌచాలయాలు.. ఉచితం కాదు

హైదరాబాద్: మరుగుదొడ్ల సేవలు ఉచితంగా అందించాలనే ఆలోచనను జీహెచ్‌ఎంసీ విరమించుకుంది. నిర్వహణ కోసం రూ.కోట్ల ప్రజాధనం ఖర్చు చేస్తున్నా.. శుభ్రంగా ఉండటం లేదని గుర్తించింది. సగానికిపైగా దుర్వాసన, దుర్గంధంతో రహదారులపై చెత్తకుప్పల కన్నా దారుణంగా తయారయ్యాయి. ఈ కారణంగానే జీహెచ్‌ఎంసీ ఉచిత విధానానికి స్వస్తి చెప్పడానికి ప్రతిపాదన సిద్ధం చేసింది. గురువారం నాటి స్థాయీ సంఘం సమావేశంలో తీర్మానాన్ని ఆమోదింపజేసుకుని.. వీలైనంత తొందరగా శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్లకు కొత్త రూపం




ఇవ్వాలని నిర్ణయించుకుంది.

**కొత్త విధానంతో..** నగరంలో అయిదేళ్ల కిందట రూ.60 కోట్లతో మూడు వేల ప్రీ ఫ్యాబ్రికేటెడ్ టాయిలెట్లు(పీఎఫ్‌టీ), బయో, ఆర్‌సీసీ టాయిలెట్లు ఏర్పాటు చేశారు. ఏడాది తిరగకుండానే సగం నిరుపయోగంగా మారాయి. రోజూ ఉదయం, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో మరుగుదొడ్లను శుభ్రం చేసేందుకు జీహెచ్‌ఎంసీ గుత్తేదారులను నియమించింది. నెలకు ఒక్కో నిర్మాణానికి రూ.35వేలు చెల్లించింది. పారిశుద్ధ్య విభాగం ఎస్‌ఎఫ్‌ఏ, ఏఎంఓహెచ్‌లు శుభ్రత పనులు జరుగుతున్నట్లు సంతకాలు చేయడం, గుత్తేదారులు ఐదేళ్లు నిర్వహణ పేరుతో సొమ్ము నొక్కేయడం జరిగింది. క్షేత్రస్థాయిలో చేసిన సర్వేలో నిధులు దుర్వినియోగం అవుతున్నట్లు ప్రస్తుత కమిషనర్ ఆర్వీ కర్ణన్ గుర్తించారు. తాజాగా ఈ నిర్ణయానికి వచ్చారు.

# ఆశావహుల్లో ఉత్సాహం

కరీంనగర్ : గ్రామ పంచాయతీ ఎన్నికలు సెప్టెంబరు 30వ తేదీలోగా నిర్వహించాలని హైకోర్టు ఆదేశించడంతో గ్రామ పంచాయతీ ఎన్నికల బరిలో దిగే ఆశావహుల్లో ఉత్సాహం నెలకొంది. ఇప్పటికే గతంలో పోటీ చేసి పదవీకాలం ముగిసిన వారు.. కొత్తగా బరిలో దిగేవారు పోటీ చేసేందుకు కసరత్తు చేసుకుంటున్నారు. మరోవైపు ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం కూడా సిద్ధం చేసుకుంది. ఎన్నికల సంఘం తేదీ ప్రకటించడమే ఆలస్యం అన్నట్లుగా ఉంది.

**గ్రామాల్లో కోలాహలం** 2024 జనవరి 30న పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసింది. ఆ తర్వాత ఎన్నికలు నిర్వహించకపోవడంతో మాజీ సర్పంచులు హైకోర్టును ఆశ్రయించారు. మూడు నెలల్లోగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని, 30 రోజుల్లో వార్డుల విభజన ప్రక్రియ పూర్తి చేయాలని హైకోర్టు మంగళవారం ఆదేశించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,224 గ్రామ పంచాయతీలు, 11,180 వార్డులు ఉన్నాయి. వీటికి రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. హైకోర్టు తీర్పుతో గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక రాజకీయాలపై ఆసక్తి ఉన్న ఆశావహులు ప్రధాన పార్టీల మద్దతుపై దృష్టి పెట్టారు. **రిజర్వేషన్లపై ఉత్కంఠ** ఈ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్న డిమాండ్ ఉంది. ఈ విషయంలోనూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. గతంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు కలిపి 50 శాతం వరకు ఉండేవి. ఇప్పుడు కొత్త ప్రతిపాదనలతో రిజర్వేషన్ల ప్రక్రియలో మార్పులు జరగనున్నాయి. దీంతోపాటు గత ప్రభుత్వం చేసిన చట్టం ప్రకారం 2019లో కేటాయించిన రిజర్వేషన్లు పదేళ్ల వరకు కొనసాగాలి. దీనిపైనా ప్రస్తుతం ప్రభుత్వం ఏం నిర్ణయం తీసుకుంటుందా అన్న ఉత్కంఠ ఆశావహుల్లో నెలకొంది. గత రిజర్వేషన్ల ప్రకారం అధికారులు ఇప్పటికే నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. మరోవైపు గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించే విషయంలో సంబంధిత యంత్రాంగం సిద్ధంగా ఉంది.

# విద్యార్థుల్ని చదివి.. విలువలు నేర్పి



హైదరాబాద్: తరగతి గదుల్లో పిల్లల మనసెరిగి విద్యాబోధన చేసేలా వినూత్న బోధన పద్ధతులను రాష్ట్రంలోనే తొలిసారిగా ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రవేశపెట్టనుంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల సామాజిక నేపథ్యం తెలుసుకుని వారి భావోద్వేగాలను అర్థం చేసుకుని తదనుగుణంగా అవసరమైన సిలబస్‌ను రూపొందించనుంది. ఓయూ ఉపాధ్యాయ విభాగం ఆచార్యులు సిలబస్ రూపకల్పన చేస్తున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కొత్త సిలబస్ ఉండాలన్న లక్ష్యంతో అమెరికాలోని నోటెర్‌డామ్ విశ్వవిద్యాలయం ప్రతినిధి ప్రొఫెసర్ నీల్‌బూత్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు.

**తొలుత ఆచార్యులు.. తర్వాత అధ్యాపకులు**

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల మనసులను అర్థం చేసుకుని పాఠాలు చెప్పడమే ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యం. తొలుత ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఆచార్యులకు రెండువారాలపాటు శిక్షణ ఇవ్వడం, అనంతరం బీఈడీ కళాశాలల్లో అధ్యాపకులకు సామాజిక, భావోద్వేగాల ఆధారంగా పాఠాలను ఎలా వివరించాలన్న అంశాలపై అవగాహన కల్పించనున్నారు. నోటెర్‌డామ్ విశ్వవిద్యాలయం ఆచార్యులు ఓయూ ఆచార్యులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు.

**కౌమార దశలో అత్యంత కీలకం**

కౌమారదశ విద్యార్థులకు సామాజిక, భావోద్వేగ విద్య అత్యంత కీలకంగా మారనుంది. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 8,9,10 తరగతి విద్యార్థుల్లో 50 శాతానికిపైగా సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్‌లను అనుసరిస్తున్నారు. ఎందుకు సరిగా చదవడంలేదని ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తే... తోటి విద్యార్థుల ముందు అవమానించారని భావిస్తున్నారు. సామాజిక మాధ్యమాలు, సినిమాల ప్రభావంతో కొన్ని తొమ్మిది, పదోతరగతి చదువుకుంటున్న విద్యార్థుల్లో కొందరు సిగరెట్లు, ఈ-సిగరెట్లు కాల్చుతున్నారు. అశ్లీల చిత్రాలు చూస్తున్నారు. ఇలాంటి విద్యార్థుల మానసిక పరిస్థితిని తెలుసుకుని సామాజిక మాధ్యమాల దుష్ప్రభావాలు, చెడు అలవాట్ల పర్యవసానాలను వివరించి వారి ప్రవర్తనలో మార్పులు వచ్చేలా చేయనున్నారు.

**శిక్షణ నైపుణ్యాలు.. ఉత్తమ పరిశోధనలు**

ప్రొఫెసర్ కుమార్ మొలుగరం, వీసీ, ఓయూ

ఆచార్యులు, అధ్యాపకులు, కాబోయే ఉపాధ్యాయుల్లో శిక్షణ నైపుణ్యాలను పెంచేందుకు, సంయుక్తంగా ఉత్తమ పరిశోధనలు చేసేందుకు రెండు వర్సిటీల మధ్య ఒప్పందం ఎంతో ప్రయోజనకరంగా మారనుంది. మూడు, నాలుగేళ్లలోనే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో కొత్త విధానంలో పాఠాలు చెప్పనున్నారు. ఈ విధానం ప్రత్యక్షంగా, పరోక్షంగా విద్యార్థుల ప్రవర్తనలో విభిన్న, వినూత్న మార్పులను తీసుకురానుంది.

# చిన్నాసుపత్రికి చిక్కిపాయె.. పెద్దాసుపత్రే దిక్కాయె



హైదరాబాద్ : వానాకాలంలో ఎంతో కీలకమైన ప్రాథమిక వైద్య, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాల నిర్వహణ గాడి తప్పుతోంది. వైద్యులు, సమయపాలన లేక, సిబ్బందికి జీతాలు అందక వైద్యం అంతంతమాత్రంగానే అందుతోంది. నగరంలో 250 వరకు బస్తీ దవాఖానాలు, 95కు పైగా పట్టణ ఆరోగ్య కేంద్రాలు, వందకు పైగా పీహెచ్‌సీలున్నాయి. అనేకచోట్ల లోపాలు, సమస్యలు ఉన్నాయి. ఆసిఫ్‌నగర్, ఉస్మానియా ఆసుపత్రి: వానాకాలం నేపథ్యంలో ఆయా కేంద్రాల పరిధిలో పూర్తి సన్నద్ధత అవసరం ఉంది. కొన్నిచోట్ల బీపీ మందులు లేవు. చాలా బస్తీ దవాఖానాల్లో వైద్యులు లేరు. ఉన్నచోట సమయపాలన పాటించడం లేదని రోగులు వాపోతున్నారు. ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులకు రోగులు పోటెత్తడంతో వాటిపై ఒత్తిడి పెరుగుతోంది. 80 శాతం సమస్యలకు ప్రాథమిక స్థాయిలో చికిత్సతో సరిపోతుంది. మలేరియా, డయేరియా, డెంగీ ఇతర వ్యాధులకు ఇక్కడ చికిత్సలు చేయాల్సి ఉండగా వీరంతా పెద్దాసుపత్రులకు వెళ్తున్నారు.

**జీతాలు లేక లబోదిబో**

బస్తీ దవాఖానాలు, ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే అవుట్‌సోర్సింగ్ వైద్యులు, సిబ్బందికి మూడు నెలలుగా జీతాలు అందడం లేదు. దీని ప్రభావం రోగులకు అందించే సేవలపై పడుతోంది. ప్రభుత్వం నుంచి బిల్లులు రాలేదని గుత్తేదారులు జీతాలు ఆపేస్తున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా జీతాలు చెల్లించిన తరువాత ప్రభుత్వం నుంచి బిల్లులు తీసుకోవడం ఆనవాయితీ. అందుకు భిన్నంగా ప్రభుత్వం ఇవ్వలేదు కాబట్టి... తామూ చెల్లించలేమని చేతులెత్తేస్తున్నారు.

**కొన్ని కేంద్రాల్లో ఇలా..**

బంజారాహిల్స్‌లోని షౌకత్‌నగర్ బస్తీలో పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది కొరత ఉంది. రెగ్యులర్ వైద్యుడు లేకపోవడంతో జూబ్లీహిల్స్ యూపీహెచ్సీ నుంచి డిప్యూటేషన్‌పై సేవలు అందిస్తున్నారు. రోడ్డు నంబరు 7లో వైద్యుడు సెలవుపై ఉండటంతో బస్తీ దవాఖానాల నుంచి రోజుకు ఒక వైద్యుడు వస్తున్నారు.

చాంద్రాయణగుట్ట బస్తీ దవాఖానాలో 25 రోజులుగా బీ3, బీ12 పరీక్షలు నిలిచిపోయాయి. గౌలిపురలోని పటేల్‌నగర్ బస్తీ దవాఖానాలో వారానికి నాలుగు రోజులు మాత్రమే వైద్యుడు అందుబాటులో ఉంటున్నారు.

షాపూర్‌నగర్‌లోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో కుక్కకాటు మందులు లేవు. వైద్యులు సెలవు పెడితే సీనియర్ సిబ్బందే ప్రాథమిక చికిత్స అందిస్తున్నారు.

కూకట్‌పల్లి దీనబంధు కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రానికి 3 నెలలుగా వైద్యుడు లేరు. వెంకటేశ్వరనగర్ బస్తీ దవాఖానా వైద్యుడే 3 రోజుల చొప్పున రెండుచోట్ల పనిచేస్తున్నారు. ఫతేనగర్, దిల్‌కుష్‌నగర్ బస్తీ దవాఖానాకు వైద్యులు లేక రోగులు మూడు నెలలుగా ఇబ్బంది పడుతున్నారు. బీపీ, మధుమేహం మందుల కొరత ఉంది.

ముషీరాబాద్, బోలక్‌పూర్, బైబిల్‌హౌస్ ఆరోగ్య కేంద్రాల్లో బీపీ మాత్రల కొరత ఉంది. టెల్మా40 మాత్రలు లేవు.

బోలక్‌పూర్, బైబిల్‌హౌస్ ఆసుపత్రిల్లో వైద్యాధికారి లేరు.

అల్లాపూర్‌లోని పర్వత్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది కొరత వేధిస్తోంది. ఇద్దరు డాక్టర్లకు బదులు ఒక్కరే ఉన్నారు. ల్యాబ్‌టెక్నీషియన్ లేక రక్త, ఇతర పరీక్షలు చేయడం లేదు. మరుగుదొడ్లలో నీళ్లే రావడం లేదని రోగులు వాపోతున్నారు.

# వెలగని దీపం.. విడిభాగాల శాపం



కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థతోపాటు హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండి మున్సిపాలిటీల పరిధిలో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. ఎనర్జీ ఎఫీషియన్సీ సర్వీసెస్(ఈఈఎస్‌ఎల్) చేతులు ఎత్తేయడంతో వీధిదీపాల నిర్వహణ, కొత్త లైట్ల బిగింపు, మరమ్మతులు పూర్తిగా నిలిచిపోయాయి. పైగా మూడు నెలల కిందట టెండర్ ఒప్పందం కూడా ముగిసింది.

నగరపాలక సంస్థ కార్యాలయ పరిధిలో వీధి దీపాలు వెలగడం లేదనే ఫిర్యాదులు ఉండటంతో రూ.50 లక్షలతో టెండర్ పిలిచారు. విలీన గ్రామాలతోపాటు పాత 60 డివిజన్లలో సుమారు వెయ్యికిపైగా వీధి దీపాలు వెలగడం లేదు. పూర్తి స్థాయిలో విడి భాగాలు అందించాల్సి ఉండగా ఒకటెండ్రు తప్ప మిగతావి బహిరంగ మార్కెట్‌లో లభించడం లేదు. ఈఈఎస్‌ఎల్ సంస్థ ఉత్పత్తి చేసినవే క్షేత్రస్థాయిలో బిగించడంతో అసలు సమస్య మొదలైంది. టెండర్ దక్కించుకున్న గుత్తేదారు మాత్రం 18 వాట్స్‌కు సంబంధించిన పీసీబీలు, డ్రైవర్స్ అందించారు. మిగతా 70, 80, 110, 190 వాట్స్‌లకు సంబంధించిన విడిభాగాలు ఒక్కటీ లేవు. **పని చేయని సెన్సార్లు**

నగరవ్యాప్తంగా పలు చోట్ల టైమర్ సెన్సార్లు పని చేయకపోవడంతో వీధి దీపాలు సాయంత్రం త్వరగా, కొన్ని చోట్ల ఆలస్యంగా వెలుగుతుండగా ఉదయం 9 గంటల వరకు బంద్ కావడం లేదు. టైమర్లు, రిలేలు కలిపి 700 బాక్స్‌లలో 400 పని చేయడం లేదు. సింగిల్ మూడు, నాలుగు బ్రేకర్లు సుమారు 2 వేల వరకు పని చేయడం లేదు. **స్మార్ట్‌సిటీ.. లెక్క ఏదీ?**

స్మార్ట్‌సిటీలో భాగంగా వీధి దీపాలు ఎక్కడ ఏర్పాటు చేశారో వాటన్నింటిని పరిశీలించి, వెలిగించి బల్దియాకు అప్పగించాలి. దీపాలు వెలగని చోట కేబుల్ వేయలేదు. వాస్తవంగా రెండేళ్లపాటు నిర్వహణ చూసుకొని పూర్తి స్థాయిలో ఆ లైట్లు వెలుగుతున్నట్లు పేర్కొంటూ ధ్రువపత్రం ఇవ్వాల్సి ఉంటుంది. కాగా ఇంజినీరింగ్ అధికారులు చోద్యం చూస్తూ బిల్లులు కూడా తయారు చేసి ఇచ్చినట్లు ఆరోపణలున్నాయి. **మరమ్మతులు చేయిస్తున్నాం**

పెద్ద లైట్లకు సంబంధించిన విడి భాగాలు తెప్పించి మరమ్మతులు చేయిస్తున్నాం. కొన్ని డ్రైవర్స్ రావాల్సి ఉంది. రాగానే పూర్తిస్థాయిలో వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం.

– ఆయూబ్‌ఖాన్, ఇన్‌ఛార్జి డీఈఈ, కరీంనగర్ నగరపాలిక

# సెస్సు.. గ్రంథాలయానికి ఆయుష్షు

సంగారెడ్డి: మార్చి నెలాఖరుతో ఆర్థిక సంవత్సరం ముగిసింది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని చాలా పంచాయతీల్లో శతశాతం ఆస్తి పన్ను వసూలయింది. బల్దియాలకూ ఆశాజనకంగా ఆదాయం సమకూరింది. ఇందులోంచి నిర్దేశిత వాటా ప్రకారం గ్రంథాలయాలకు చెల్లించాల్సిన 'సెస్' జమ చేయడం లేదు. ఫలితంగా పుస్తక నిలయాలకు ఇబ్బందులు తప్పడం లేదు. నిధులు లేక ఉమ్మడి జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధి పడకేసింది. మండల కేంద్రాల్లోని పుస్తక నిలయాల్లో ఏళ్లుగా మార్పు కానరావడం లేదు. ఆస్తిపన్నులోని వాటాను గ్రంథాలయాలకు చెల్లిస్తే సమస్య కొంతమేరకైనా గట్టెక్కే వీలుంటుంది.

**అమలుకు నోచని ఆదేశాలు**

గ్రంథాలయాల అభివృద్ధికి పంచాయతీల్లో జమవుతున్న సెస్‌ను చెల్లించాలని ఆ సంస్థ కార్యదర్శులు పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులకు ఆదేశాలు జారీ చేసినా.. స్పందన కరవైంది. ప్రస్తుతం గ్రంథాలయాలకు అభ్యర్థుల తాకిడి అధికమైంది. వివిధ ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్నారు. వందలాది మంది నిరుద్యోగులు వస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఇక్కడే ఉండి పోటీపరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. గ్రంథాలయాల్లో వసతులు లేమి కారణంగా అభ్యర్థులకు ఇక్కట్లు తప్పడం లేదు. సెస్ బకాయిలు సమకూరితే బల్లలు, కుర్చీలు, పుస్తకాలు తెప్పించే వీలుంది.

**క్షేత్రస్థాయి పరిస్థితి**

సంగారెడ్డిలో జిల్లా లైబ్రరీతో పాటు.. 19 శాఖా గ్రంథాలయాలున్నాయి. గత నాలుగేళ్లుగా గ్రామ పంచాయతీలు సెస్‌ను జమ చేయడం లేదు. జిల్లా పరిధిలోని జహీరాబాద్, నారాయణ్‌ఖేడ్, జోగిపేట బల్దియాలు సైతం లైబ్రరీ సెస్ జమచేయక ఏళ్లు గడిచాయి. గత నాలుగేళ్ల క్రితం అప్పటి కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని పంచాయతీలతో పాటు బల్దియాల నుంచి పన్ను బకాయిలు రూ.5.18 కోట్లు జమచేయించారు. ఈ నిధులతోనే జిల్లాలోని గ్రంథాలయాల నిర్వహణ కొనసాగుతోంది. సిద్దిపేటలో జిల్లా గ్రంథాలయంతో పాటు 16 శాఖా గ్రంథాలయాలున్నాయి. గత ఎనిమిదేళ్ల నుంచి పంచాయతీలు సెస్‌ను జమచేయడం లేదు. పురపాలికలు మాత్రం నిర్దేశిత వాటా కింద పన్నులో వాటాను జమ చేస్తున్నాయి. ఈ నిధులతోనే జిల్లాలోని గ్రంథాలయాల నిర్వహణ సాగుతోంది.

మెదక్ జిల్లా గ్రంథాలయంతో పాటు 19 మండల కేంద్రాల్లో మినీ గ్రంథాలయాలున్నాయి. మెదక్, రామాయంపేట మినహా మిగిలిన బల్దియాలు సెస్ జమ చేస్తున్నాయి.

**సౌకర్యాలు మెరుగుపడితేనే..**

ఉమ్మడి మెదక్ పరిధి మూడు జిల్లాల్లోని గ్రంథాలయాల్లో సౌకర్యాలు మెరుగు పడాల్సిన అవసరం ఉంది. సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో జిల్లా గ్రంథాలయాల్లో డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం నిధుల కొరత కారణంగా డిమాండ్‌కు అనుగుణంగా విద్యార్థులు కోరిన కొన్ని పుస్తకాలు మాత్రమే తెప్పిస్తున్నారు. నిబంధనలకు అనుగుణంగా ఉండాల్సిన పుస్తకాలు అందుబాటులో ఉండడం లేదు. ప్రధానంగా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి అవసరమయ్యే పుస్తకాలు సమకూర్చాల్సి ఉంది.

**అధికారులు ఏమంటున్నారంటే..**

సెస్ బకాయిలు జమచేయాలని పంచాయతీ కార్యదర్శులతో పాటు బల్దియాల కమిషనర్లకు తాఖీదులు జారీచేశామని సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వసుంధర, మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంశీకృష్ణ పేర్కొన్నారు.

# వ్యూహం రచిద్దాం.. పాగా వేద్దాం

సంగారెడ్డి: రానున్న మూడు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని న్యాయస్థానం ఆదేశించిన నేపథ్యంలో రాజకీయ పార్టీలు ఎన్నికలకు సమాయత్తమవుతున్నాయి. గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీలైన అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష భారాస, భాజపాలు వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నాయి. పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న ఆశావహులు రిజర్వేషన్లు అనుకూలిస్తే సిద్ధంగా ఉండేందుకు కసరత్తు చేసుకుంటున్నారు.

**హామీలు అమలు చేయడం లేదని భారాస**

ప్రతిపక్ష భారాస ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో బలమైన క్యాడర్‌ను కలిగి ఉంది. మాజీ మంత్రి హరీశ్‌రావు నిత్యం కార్యకర్తలకు అందుబాటులో ఉండి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక కార్యక్రమాలపై నిరసన కార్యక్రమాలు చేపడుతూ ముందుకు సాగుతున్నారు. ఇటీవల సంగారెడ్డి జిల్లా జిన్నారంలో పటాన్‌చెరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల కర్షకులకు రైతుభరోసా కోసం మహాధర్నా నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకుంటూ.. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలు సక్రమంగా అమలు చేయడం లేదంటూ ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేస్తున్నారు.

**మెజార్టీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్**

రానున్న స్థానిక ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు కైవసం చేసుకోవడానికి



అధికార కాంగ్రెస్ పార్టీ సమాయత్తమవుతోంది. ఉమ్మడి జిల్లాలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇప్పటికే నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితి, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై నేతలు, పార్టీ కార్యకర్తల నుంచి అంతర్గతంగా సమాచారాన్ని సేకరిస్తున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలతో పాటు ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలున్న చోట మండలాల వారీగా పూర్తయిన అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నారు. ఇటీవలే ఉమ్మడి జిల్లాకు ఇన్‌ఛార్జి మంత్రిగా నియమితులైన వివేక్ వెంకటస్వామి ఉమ్మడి జిల్లాలోని పదకొండు నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితిపై నిఘా వర్గాల ద్వారా సమగ్ర సమాచారం తెప్పించుకున్నట్లు తెలుస్తోంది. పార్టీ బలహీనంగా ఉన్న నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని నిర్ణయించారు.

**పట్టున్న ప్రాంతాలపై భాజపా దృష్టి**

గ్రామీణ ప్రాంతాల్లో పట్టున్న ప్రాంతాలపై భాజపా దృష్టి సారించింది. గతంలో పలు ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలు సాధించిన దుబ్బాక నియోజకవర్గంతో పాటు లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, భారాసల కంటే అధిక ఓట్లు సాధించిన ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలోని అన్ని స్థానాల్లో పోటీచేసేందుకు భాజపా సమాయత్తమవుతోంది. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు స్థానిక ఎన్నికల్లో పట్టు సాధించేందుకు అవసరమైన వ్యూహాలు రచిస్తున్నారు. జిల్లా పార్టీ అధ్యక్షులు నియోజకవర్గాల వారీగా కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.




పాశమైలారం: సంగారెడ్డి జిల్లా పాశమైలారం రసాయన పరిశ్రమ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. రియాక్టర్ పేలడంతో ఇప్పటి వరకు 12 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. మరోవైపు పలువురు కార్మికులు ఇంకా పరిశ్రమలోనే చిక్కుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలో పరిశ్రమలోకి చొచ్చుకెళ్లేందుకు కార్మికుల కుటుంబాలు యత్నించాయి. తమవారి ఆచూకీ చెప్పాలంటూ బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమలోకి వారిని వెళ్లనివ్వకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో కుటుంబసభ్యులు, పోలీసుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. ఘటనాస్థలిలో కార్మికుల కుటుంబాల రోదనలు మిన్నంటుతున్నాయి. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశమున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రమాద సమయంలో పరిశ్రమలో 108 మంది కార్మికులు ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రుల్లో 12 మంది పరిస్థితి విషమంగా ఉంది. వారికి ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. సోమవారం పాశమైలారం పారిశ్రామికవాడలో భారీ పేలుడు సంభవించిన సంగతి తెలిసిందే. సిగాచి రసాయన పరిశ్రమలో రియాక్టర్ పేలడంతో మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో పలువురికి గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన వారిలో సంఘటన స్థలిలోనే ఐదుగురు మృతి చెందగా.. మరో 8 మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. పేలుడు ధాటికి కార్మికులు సుమారు 100 మీటర్ల దూరం ఎగిరిపడ్డారు. పేలుడు తీవ్రతకు ఉత్పత్తి విభాగం ఉన్న భవనం కూలిపోగా.. మరో భవనం బీటలు వారింది.

## పాశమైలారం ఘటన.. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి: సీఎం రేవంత్ ఆదేశం



హైదరాబాద్: సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలో పేలుడు ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో చిక్కుకున్న కార్మికులను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలో భారీ పేలుడు సంభవించింది. సిగాచీ రసాయన పరిశ్రమలో రియాక్టర్ పేలడంతో మంటలు ఎగిసిపడ్డాయి. ఈ ప్రమాదంలో 12 మంది కార్మికులు మృతి చెందారు. ఘటనాస్థలంలో ఐదుగురు.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ముగ్గురు చనిపోయారు. పేలుడు ధాటికి కార్మికులు సుమారు 100 మీటర్ల దూరం ఎగిరిపడ్డారు. పేలుడు తీవ్రతకు ఉత్పత్తి విభాగం ఉన్న భవనం కూలిపోగా.. మరో భవనానికి బీటలు వచ్చాయి.

**కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దిగ్భ్రాంతి...** పాశమైలారం ఘటనపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా అధికారులతో మాట్లాడిన ఘటన వివరాలను తెలుసుకున్నట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. బాధితులకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

## పాశమైలారం ఘటనపై మాజీ సీఎం కేసీఆర్ దిగ్భ్రాంతి



హైదరాబాద్: సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలో జరిగిన పేలుడు ఘటనపై మాజీ సీఎం కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సిగాచి పరిశ్రమలో 8 మంది కార్మికుల మృతిపట్ల సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. చనిపోయిన వారి కుటుంబాలని ఆదుకోవాలన్నారు. సిగాచీ రసాయన పరిశ్రమలో రియాక్టర్ పేలడంతో ఇప్పటి వరకు 12 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఘటనాస్థలంలో ఐదుగురు.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ముగ్గురు చనిపోయారు. గాయపడిన మరికొందరు కార్మికులు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. పేలుడు ధాటికి కార్మికులు సుమారు 100 మీటర్ల దూరం ఎగిరిపడ్డారు. పేలుడు తీవ్రతకు ఉత్పత్తి విభాగం ఉన్న భవనం కూలిపోగా.. మరో భవనానికి బీటలు వారాయి.




ఇరాన్ అణుకేంద్రాలపై అమెరికా చేసిన దాడుల ప్రభావం కొన్ని నెలలు మాత్రమే ఉంటుందని అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ) అధిపతి రఫేల్ గ్రాసీ పేర్కొన్నారు. ఇరాన్ అణు కేంద్రాలను నుజ్జునుజ్జు చేశామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనకు ఇది పూర్తి భిన్నంగా ఉండటం గమనార్హం. టెహ్రాన్ మరికొన్ని నెలల్లోనే అణు ఇంధనం శుద్ధి చేయడాన్ని ప్రారంభించగలదని చెప్పారు. ఈ వ్యాఖ్యలు దాడి అనంతరం వెలువడిన పెంటగాన్ ఇంటెలిజెన్స్ నివేదికలో ఇచ్చిన సమాచారానికి మరింత బలం చేకూర్చేలా ఉన్నాయి. "నిజం చెప్పాలంటే.. అంతా మాయమైపోయిందని, అక్కడేమీ మిగల్లేదని ఎవరూ చెప్పలేరు. అమెరికా రెండు అణుకేంద్రాలపై 14 బంకర్ బస్టర్ బాంబులు వేసింది. తీవ్రంగా నష్టం వాటిల్లింది. కానీ, పూర్తిగా నాశనమైపోలేదు" అని రాఫేల్ గ్రాసీ పేర్కొన్నారు. ఆ రెండు కేంద్రాల్లో 18,000 సెంట్రిఫ్యూజ్‌లు ఉండొచ్చని గతంలో ఆయన అంచనా వేశారు. వాస్తవానికి డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ రిపోర్టు పూర్తిగా బంకర్ బస్టర్ బాంబులు ప్రయోగించిన యురేనియం శుద్ధి కేంద్రాల పైనే ఉంది. కానీ, ఇతర గ్రూపుల నుంచి వచ్చిన విశ్లేషణల ప్రకారం ఇరాన్‌కు అతిపెద్ద దెబ్బ ఇస్ఫహాన్‌లో తగిలింది. ఇక్కడ శుద్ధి చేసిన యురేనియంను లోహంగా మార్చేందుకు అవసరమైన ల్యాబ్ అమెరికా దాడిలో ధ్వంసమైంది. ఇది మాత్రం టెహ్రాన్‌కు ఇబ్బందికర విషయమే. అణ్వాయుధం తయారీకి ఈ ప్రక్రియ చాలా కీలకం. మరోవైపు ఇరాన్ ఉన్నతాధికారుల సంభాషణలను ఇంటెలిజెన్స్ వర్గాలు పసిగట్టి విశ్లేషించాయి. వారు ఊహించినంత నష్టం వాటిల్లలేదని దీనిని బట్టి తెలుస్తోంది. ట్రంప్ మాత్రం ఇంటెలిజెన్స్ నివేదికలు లీక్ చేసిన సీఎన్ఎన్, న్యూయార్క్ టైమ్స్‌ను కోర్టుకు లాగాలని నిర్ణయించుకొన్నారు. ఈ విషయాన్ని ఆయన ఫాక్స్ న్యూస్ ఇంటర్వ్యూలో ప్రస్తావించారు. తాము చట్ట ప్రకారం వెళ్లి.. "జాతీయ భద్రతకు సంబంధించిన సమాచారాన్ని వారికి ఎవరు ఇచ్చారో వెల్లడించాలి" అని కోరతామన్నారు. మరోవైపు ఇరాన్ దౌత్యవేత్త అమిర్ సయిదీ ఇరావని కూడా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ యురేనియం శుద్ధి ప్రక్రియ ఎప్పటికీ ఆగదని తేల్చిచెప్పారు. శాంతియుత అణు కార్యక్రమం కోసం ఇలా చేసే హక్కు ఇరాన్‌కు ఉందన్నారు.




హైదరాబాద్: తెలంగాణ భాజపా అధ్యక్షుడిగా ఎవరనే ఉత్కంఠకు తెరపడింది. ఈ పదవికి మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు పేరు ఖరారైంది. ఈ మేరకు నామినేషన్ వేయాలని పార్టీ అధిష్ఠానం ఆయన్ను ఆదేశించింది. మధ్యాహ్నం 2 గంటలకు రామచందర్‌రావు నామినేషన్ దాఖలు చేశారు.

రాష్ట్ర అధ్యక్ష పగ్గాలు ఎవరికి అప్పగించాలన్న విషయంపై భాజపా అగ్రనేతలు తీవ్ర కసరత్తు చేశారు. ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్, కె.లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు పేర్లు బలంగా వినిపించాయి. ఈ క్రమంలో రామచందర్‌రావు పేరును ఖరారు చేశారు. ఆరెస్సెస్‌తో పాటు కొందరు సీనియర్ నేతలు ఆయన పేరును బలంగా ప్రతిపాదించినట్లు తెలిసింది.

అధికార కాంగ్రెస్‌ను ఎదుర్కోవడం, పార్టీని బలోపేతం చేయడం, స్థానిక సంస్థల ఎన్నికలు తదితర అంశాలను కొత్త అధ్యక్షుని ఎంపికలో పరిగణనలోకి తీసుకున్నట్లు సమాచారం.

## పథకం ప్రకారమే కేసీఆర్ కుటుంబంపై కక్ష సాధింపు: జగదీశ్‌రెడ్డి



హైదరాబాద్: పథకం ప్రకారమే కేసీఆర్ కుటుంబంపై కక్ష సాధింపు జరుగుతోందని భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ కేసుతో కేసీఆర్, కేటీఆర్‌కు ఏం సంబంధమని ప్రశ్నించారు. ఏ విచారణ అధికారైనా వాళ్ల పేర్లు చెప్పారా? అని ప్రశ్నించారు. "ఫోన్ ట్యాప్ చేశారని ఎవరైనా ఫిర్యాదు చేశారా? ఊహించి రాసి.. ఇదే జర్నలిజం అంటే ఊరుకునేది లేదు. ఆధారాలు లేకుండా రాస్తే మా చర్యలు కఠినంగా ఉంటాయి. దుష్ప్రచారంపై కేసీఆర్ ఊరుకున్నా మేం ఊరుకోం. దేశంలో ఫోన్ ట్యాపింగ్ ఎక్కడా జరగడం లేదా? ఇప్పుడు ట్యాపింగ్ జరగట్లేదని సీఎం చెప్పగలరా?" అని జగదీశ్‌రెడ్డి అన్నారు.

## తెలంగాణలో భాజపా అధికారంలోకి వస్తే బీసీ సీఎం: బండి సంజయ్



హైదరాబాద్: భాజపా ప్రజాస్వామ్య పార్టీ అని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. రాష్ట్ర అధ్యక్ష పదవికి నామినేషన్ ఎవరైనా వేసుకోవచ్చని.. అధిష్ఠానం చెప్పిన ప్రకారం నడుచుకోవాలని సూచించారు. నాంపల్లిలోని భాజపా కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. "భాజపా అధిష్ఠానం ఇంకా అధ్యక్షుడిని అధికారికంగా ప్రకటించలేదు.

భాజపా.. ఎవరో చెప్పారని అధ్యక్షుడిని నియమించే పార్టీ కాదు. అధిష్ఠానం చెప్పిన వ్యక్తే అధ్యక్షుడు అవుతారు. పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో భాజపా అధికారంలోకి వస్తుంది.. బీసీని సీఎం చేస్తాం. అధిష్ఠానం నిర్ణయానికి కార్యకర్తలు కట్టుబడి ఉంటారు. దళితులను సీఎం చేస్తామని భారాస మోసం చేసింది. ఆ పార్టీ బీసీలకు సీఎం, పార్టీ అధ్యక్ష పదవులు ఇస్తామని ప్రకటించగలదా?"అని సంజయ్ వ్యాఖ్యానించారు.

## మాదాపూర్‌లో హైడ్రా కూల్చివేతలు.. అడ్డుకున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



హైదరాబాద్: నగర పరిధి మాదాపూర్‌లోని సున్నం చెరువులో హైడ్రా కూల్చివేతలను ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అడ్డుకున్నారు. దీనిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సున్నం చెరువులో కూల్చివేతలను ఆపేయాలని డిమాండ్ చేశారు. సున్నం చెరువులో ఆక్రమణల తొలగింపును సోమవారం హైడ్రా చేపట్టింది. 32 ఎకరాల విస్తీర్ణంలోని సున్నం చెరువులో భారీగా ఆక్రమణలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమంగా నిర్మించిన గుడిసెలను కూల్చేశారు. చెరువు సమీపంలో అక్రమంగా వేసిన బోరు మోటార్లను తొలగించారు. చెరువు పరిధిలోని భూగర్భ జలాలను వినియోగించొద్దని హైడ్రా సూచించింది. అక్రమంగా నీటిని తరలిస్తున్న పలు వాటర్ ట్యాంకర్లను సీజ్ చేసింది.




భారత్ నుంచి ఒమన్‌కు వెళ్తున్న ఓ నౌకలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈమేరకు సమాచారం అందుకున్న వెంటనే భారత నౌకాదళ సిబ్బంది రంగంలోకి దిగారు. బోట్లు, హెలికాప్టర్ సాయంతో హుటాహుటిన నౌక వద్దకు చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

ప్రమాదానికి గురైన నౌకలో భారత సంతతికి చెందిన 14 మంది సిబ్బంది ఉన్నట్లు నేవీ అధికారులు తెలిపారు. "ఎం.టి యీ చెంగ్ 6 అనే నౌక గుజరాత్‌లోని కాండ్లా నుంచి ఒమన్‌కు బయల్దేరింది. అందులో భారత సంతతికి చెందిన 14 మంది సిబ్బంది ఉన్నారు. మార్గమధ్యలో 'గల్ఫ్ ఆఫ్ ఒమన్' నౌకలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఇంజిన్ గదిలో మంటలు చెలరేగడంతో మొత్తం విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. దీంతో సిబ్బంది అత్యవసర సాయం కోసం సందేశం పంపారు. సమీపంలో విధుల్లో ఉన్న 'ఐఎన్ఎస్ తబర్'.. వెంటనే అప్రమత్తమైంది. బోట్లు, హెలికాప్టర్ సాయంతో అగ్నిమాపక సిబ్బంది, పరికరాలను తరలించింది. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మంటలు చాలావరకు నియంత్రణలోకి వచ్చాయి" అని భారత నౌకాదళం ట్వీట్ చేసింది. ఇదిలాఉండగా.. ఇటీవల కేరళ తీరంలో ప్రమాదానికి గురైన ఓ కంటెయినర్ నౌకలోని సిబ్బందినీ నౌకాదళం కాపాడిన విషయం తెలిసిందే. అంతకుముందు అరేబియా సముద్రంలో మునిగిపోయిన ఓ నౌకలోని 12 మందిని కాపాడింది. పలు సందర్భాల్లో సోమాలియా సముద్రపు దొంగల చేతిలో హైజాక్‌కు గురైన వాణిజ్య నౌకల్లోని సిబ్బందిని సురక్షితంగా విడిపించింది.

## ఉపాధ్యాయుల బదిలీ.. కన్నీటి పర్యంతమైన విద్యార్థులు

మాస్టారు మమ్మల్ని వదిలిపెట్టి వెళ్లొద్దంటూ ఓ పాఠశాలకు చెందిన విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు. అనకాపల్లి జిల్లా బుచ్చయపేట మండలం పి.కందిపూడి ప్రభుత్వ పాఠశాలలో శ్రీరాములు, రమణలు మినిమం టైం స్కేల్ ఉపాధ్యాయులుగా రెండేళ్లుగా పనిచేస్తున్నారు. ఈ ఇద్దరు ఉపాధ్యాయులు ఏనాడు సెలవు పెట్టకుండా నిత్యం పాఠశాలకు వచ్చి చదువులో వెనుకబడిన విద్యార్థులకు మరో గంట అదనంగా బోధన చేసేవారు. గురు శిష్యులు తేడా లేకుండా స్నేహంగా మెలిగేవారు. ఈ ఇద్దరూ వచ్చాక పాఠశాలలో ప్రవేశాలు పెరిగాయి. అయితే వీరు బదిలీపై వేరే ప్రాంతానికి వెళ్తున్నట్లు విద్యార్థులకు తెలియడంతో కంటతడి పెట్టి భోరున విలపించారు.



## ఎన్నికల సంఘం సంచలనం.. మీ మొబైల్‌లోనే మీ ఓటు..!

ఎన్నికలు అనగానే ఓటర్లకు, ఓట్లకు కూడా ప్రాధాన్యం ఉన్న విషయం అంతా ఇంతాకాదు. అప్పటి వరకు సాధారణ జీవితం గడిపిన పౌరుడు కూడా.. ఓటరు మహాశయుడిగా, ఓటరు దేవుడిగా మారిపోతాడు. అది ప్రజాస్వామ్య దేశాల్లో ముఖ్యంగా భారత్ వంటి అతి పెద్ద దేశాల్లో ఓటుకు ఉన్న వాల్యూ. ఇక, ఓటు హక్కు వినియోగించుకునే విధానాల్లోనూ మార్పులు వస్తున్న విషయం తెలిసిందే. అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకుని కేంద్ర ఎన్నికల సంఘం ఓటు హక్కును వినియోగించుకునే ప్రక్రియను ఇప్పటికి రెండు సార్లు మార్చింది. దీనిలో ఒకప్పుడు బ్యాలెట్ ఓటు ప్రక్రియ ఉండేది. దీనిలో స్లిప్పులపై ఉన్న ఎన్నికల గుర్తుపై ముద్ర వేసి బ్యాలెట్ బాక్సులో వేసే విధానం. పంచాయతీల్లో ఇప్పటికీ ఈ విధానం అమలు అవుతున్నా.. సార్వత్రిక, అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం లేదు. దీని స్థానంలో ఈవీఎంలను తీసుకువచ్చారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ద్వారా.. మిషన్‌పై ఉన్న బటన్‌లలో ఒక దానిని నొక్కి ఓటరు తమకు నచ్చిన నాయకుడిని ఎన్నుకునే విధానం. ప్రస్తుతం ఇదే దేశవ్యాప్తంగా అమలవుతోంది. అయితే..దీనిపై అనేక సందేహాలు, అనుమానాలు వస్తూనే ఉన్నాయి. కానీ.. ఎన్నికల సంఘం మాత్రం ఈవీఎంలలో ఎలాంటి దోషం లేదని




చెబుతోంది. పైగా ఈవీఎంలను ఎవరూ హ్యాక్ చేయడం సాధ్యంకాదని ఇటీవల కొన్ని మాసాలకు ముందు సుప్రీంకోర్టుకు కూడా వివరించింది. అయినప్పటికీ.. అధికారం కోల్పోయిన వారు.. అధికారంలోకి వస్తామని ఆశలు పెట్టుకున్నవారు మాత్రం తరచుగా ఈవీఎంలపై నే విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ క్రమంలో మరిన్ని మార్పుల దిశగా కేంద్ర ఎన్నికల సంఘం అడుగులు వేస్తోంది. ఓటు బేసే ప్రక్రియలో మరో మార్పు దిశగా అడుగులు వేసింది. ప్రస్తుతం రూపొందించిన ప్రత్యేకయాప్ ద్వారా ఓటర్లు తమ మొబైల్ ఫోన్ల నుంచే ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పిస్తోంది. ప్రత్యక యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని.. దానిలో వివరాలు నమోదు చేయడం ద్వారా ఓటర్లుతమ ఓటు వేసే అవకాశం అందుబాటులోకి రానుంది.

**ప్రస్తుతానికి పరిమితంగా..** తాజాగా ఎన్నిక లసంఘం రూపొందించిన ప్రత్యేక యాప్‌ను ఈ ఏడాది జరిగే బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారి ప్రవేశ పెట్టనున్నారు. ఈ-ఓటింగ్‌లో పాల్గొనాలనుకునే వారికోసం e-SECBHR యాప్‌ను రూపొందించారు. ఓటర్ ఐడీ, ఫోన్ నంబర్ సాయంతో ముందుగా ఇందులో రిజిస్టర్ చేసుకోవాలి.

పోలింగ్ జరిగే రోజు నిర్దేశించిన సమయంలో ఎప్పుడైనా ఈ యాప్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. సీ-డాక్ సంస్థ అభివృద్ధి చేసిన ఈ యాప్ అందుబాటులోకి వచ్చింది. కాగా.. ఒక మొబైల్ ఫోన్ నుంచి కేవలం ఇద్దరు ఈ-ఓటర్లు మాత్రమే ఓటు వేసే వీలుంటుందని బీహార్ అధికారులు తెలిపారు. ఈ ప్రక్రియ సక్సెస్ అయితే.. వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి.. లేదా ఈ లోగా జరిగే పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లోనూ మొబైల్ ఓటింగ్ విధానం అందుబాటులోకి తీసుకువస్తారు. ఓటు వేసిన తర్వాత..ఎవరికి ఓటు వేశారనేది పీడీఎఫ్ రూపంలో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

## భయపెడుతోన్న రైల్లో కొత్త దొంగతనాలు... ఎలా చేస్తున్నారంటే..?




రైల్లో ప్రయాణిస్తున్నప్పుడు కిటికీల పక్కన కూర్చున్న వారు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తుంటారు. ట్రైన్ కదలడం మొదలవ్వగానే.. మెడలోని చైన్స్ కిటికీలోంచి లాక్కుని, చేతిలోని సెల్ ఫోన్స్ తీసుకుని పారిపోతుంటారు. ఇలా రకరకాల టెన్షన్స్ రైల్లో ప్రయాణించే సమయంలో ఉంటాయని చెబుతారు! ఈ సమయంలో తాజాగా కొత్తరకం దొంగతనం అధికారులను టెన్షన్ పెడుతోంది. అవును... కిటికీ దగ్గర కూర్చుని అప్రమత్తంగా లేనివారి మెడలోని గొలుసులు లాక్కుని పోవడం, సెల్ ఫోన్లు ఎత్తుకుపోవడం వంటి దొంగతనాలతో పాటు తాజాగా రైలు ప్రయాణికులను దోచుకోవడానికి కొందరు దొంగలు ఏకంగా రైల్వే సిగ్నళ్లను ట్యాంపరింగ్ చేస్తున్నారనే విషయం తాజాగా తెరపైకి వచ్చింది. దీంతో.. రైల్వే ఉన్నతాధికారుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు! ఆంధ్రప్రదేశ్ లో ఇప్పటి వరకు ఒంగోలు, రేణిగుంట సమీపంలోని ముంగిలిపట్టు.. తెలంగాణలోని అలంపూర్, మానవపాడు, ఇటిక్యాల రైల్వేస్టేషన్ల పరిధిలో ఇలా... రైళ్లను సిగ్నళ్లు ఉన్నచోట ఆపేలా చేసి మరీ దొంగతనం చేసిన ఘటనలు జరిగినట్లు రైల్వే పోలీసుల రికార్డుల్లో నమోదైందని తెలుస్తోంది. తాజాగా అనంతపురం జిల్లా తాడిపత్రిలోనూ ఇలాంటి ఘటన చోటు చేసుకుంది. ఇందులో భాగంగా.. తాడిపత్రి మండలంలోని కోమలి అనే ప్రాంతంలో సిగ్నల్ ట్యాంపరింగ్ చేసిన దుండగులు.. చెంగల్పట్టు ఎక్స్ ప్రెస్ రైలు ఆగేలా చేశారు. ఈ సమయంలో.. ఓ మహిళ మెడలోని 2.7 తులాల బంగారు ఆభరణాలను అపహరించి పారిపోయారు. దీంతో... ఈ తరహా కొత్త రకం దొంగతనాలు ఆందోళన కలిగిస్తున్నాయని అంటున్నారు. ఈ సందర్భంగా... మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందినవారు ఈ తరహా దొంగతనాలకు పాల్పడుతున్నట్లు రైల్వే పోలీసులు భావిస్తున్నారని తెలుస్తోంది. పార్థీ గ్యాంగ్, శోలాపుర్ గ్యాంగ్, మీర్జాపూర్ గ్యాంగ్‌లతోపాటు జామ్ కేడ్, బీడ్ తదితర ప్రాంతాలకు చెందిన నేరస్థులు సిగ్నల్ ట్యాంపరింగ్ చేసి దొంగతనాలు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు గుర్తించారని అంటున్నారు. ఇదే సమయంలో... శనివారం తెల్లవారుజామున న్యూ పిడుగురాళ్ల రైల్వేస్టేషన్ సమీపంలోనూ ఇలాంటి ఘటనే చోటు చేసుకుంది. ఇందులో భాగంగా.. ఆ ప్రాంతంలో సిగ్నల్ వ్యవస్థను దుండగులు ట్యాంపరింగ్ చేయడంతో సిగ్నల్ నిలిచిపోయింది. దీంతో ఆ సమయంలో విశాఖనుంచి చర్లపల్లి వెళుతున్న స్పెషల్ ఎక్స్ ప్రెస్ రైలు లోకోపైలట్ రైలును ఆపేశారు. %వెంటనే దుండగులు రెండు బోగీల్లోకి వెళ్లి ఇద్దరు మహిళల మెడల్లోని బంగారం గొలుసులు లాక్కొని పరారయ్యారు. ఈ ఘటనతో తెల్లవారుజామున 4:12 నుంచి 5:30 గంటల వరకు రైలు నిలిచిపోయిన పరిస్థితి. ఈ ఘటనలో ఒక మహిళ మెడలో 20 గ్రాముల గొలుసు, మరో మహిళకు చెందిన 30 గ్రాముల గొలుసు చోరీ అయినట్లు చెబుతున్నారు. ఈ సమయంలో... రైల్వే సిగ్నళ్లను ట్యాంపరింగ్ చేయడానికి దొంగలు రకరకాల పద్దతులను ఉపయోగిస్తున్నారని అంటున్నారు. ఇందులో ప్రధానంగా.. స్టేషన్లకు సమీపంలోని సిగ్నళ్లను ట్యాంపర్ చేయడానికి వీలుగా జంక్షన్ బాక్స్‌లో షార్ట్ సర్క్యూట్ అయ్యేలా చేస్తున్నారు. మరికొంతమంది... రైల్వే సిగ్నలింగ్ వ్యవస్థ సర్క్యూట్ బోర్డును పగలగొట్టి సిగ్నళ్లు పడకుండా చేస్తున్నారు. మరికొంతమంది సిగ్నల్ వ్యవస్థ వైర్లను కత్తిరించి సిగ్నల్ పడకుండా చేసి రైలును ఆపే పరిస్థితులు సృష్టిస్తుండగా... సిగ్నల్స్ కనపడకుండా ఉండేలా లైటు ఉండే భాగానికి ఒక వస్త్రాన్ని చుట్టేస్తున్నవారు మరికొంతమంది అని చెబుతున్నారు. ఇందులో ఏది చేసినా.. ట్రైన్ ఆపడమే వారికి ముఖ్యం!!

## యుఎస్ వీసా స్లాట్లలో గందరగోళం

## లండన్‌లో బుకింగ్, ఆఫ్రికాలో ఇంటర్వ్యూలు?

యునైటెడ్ కింగ్‌డమ్‌లో యుఎస్ వీసా అపాయింట్‌మెంట్‌లు బుక్ చేసుకున్నవారికి ఊహించని షాక్ తగిలింది. ధృవీకరించబడిన ఇంటర్వ్యూలు రద్దవడమే కాకుండా కొన్ని సందర్భాల్లో ఆఫ్రికాలోని జింబాబ్వే దేశ రాజధాని హరారేకి మారడం కలకలం రేపుతోంది. ఈ పరిణామంపై వీసా అభ్యర్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై సామాజిక మాధ్యమాల్లో వీసా అభ్యర్థులు తమ అసహనాన్ని వెళ్లగక్కుతున్నారు. కొందరు తమ ఆగస్టు 28వ తేదీన షెడ్యూల్ చేయబడిన ఇంటర్వ్యూలు అకస్మాత్తుగా సెప్టెంబర్ 2వ తేదీకి మారినట్టు మెయిల్ వచ్చిందని పంచుకుంటే, మరికొందరు తమ అకౌంట్లలో ఇంటర్వ్యూ వేదిక హఠాత్తుగా హరారేగా మారిపోయిందని వెల్లడించారు. ఇంకా విచిత్రం ఏమిటంటే ఈ ఇమెయిల్స్‌లో “Dear Visa aplicant” అనే తప్పుడు స్పెల్లింగ్‌తో సందేశాలు పంపించడం దరఖాస్తుదారులను షాక్ కు గురిచేసింది. మొదట వీటిని ఫిషింగ్




మోసాలుగా భావించినప్పటికీ ఇవి నిజమైన రీషెడ్యూలింగ్‌లే అని తరువాత అర్థమైంది. నెలల తేదీలు మారడం సర్వసాధారణంగా మారింది. ఆగస్టు నుంచి అక్టోబర్‌కు, సెప్టెంబరు నుంచి ఏకంగా జనవరి 2026కు మారినట్లు బాధితులు వాపోతున్నారు.

**సహనం కోల్పోతున్న అభ్యర్థులు :** ఈ మార్పులకు ఎటువంటి కారణమూ చెప్పకుండా వేరే ఎంపికలు లేవని, డబ్బు తిరిగి ఇవ్వడం లేదని, కస్టమర్ కేర్ నుండి ఎటువంటి సమాధానం రావడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీసా అభ్యర్థుల్లో కొంతమంది దీనిని సాంకేతిక లోపంగా భావిస్తుండగా, మరికొంతమంది దౌత్య కార్యాలయంపై పడుతున్న భారం వల్ల ఇలాంటి మార్పులు జరుగుతున్నాయని అభిప్రాయపడుతున్నారు. సోషల్ మీడియాలో కొన్ని కామెంట్లు దీనిని ఉద్దేశపూర్వకంగా వీసా ప్రక్రియను ఆలస్యం చేసి, ప్రజలను మళ్లీ దరఖాస్తు చేయించుకోవడానికి చేసే “డబ్బు వృథా” చేసే వ్యూహంగా ఎద్దేవా చేస్తున్నాయి.

**భవిష్యత్తుపై ప్రభావం...** విదేశీ విద్య, ఉద్యోగావకాశాలు కోరుకుంటున్నవారికి వీసా అపాయింట్‌మెంట్‌లు వారి జీవితాలను ప్రభావితం చేసే అంశాలు. ఇటువంటి గందరగోళపు మార్పులు అభ్యర్థుల భవిష్యత్తును తీవ్రంగా ప్రభావితం చేసే అవకాశం ఉంది. ఈ పరిస్థితిపై యుఎస్ అధికారులు స్పష్టత ఇవ్వాలని, పారదర్శక విధానం పాటించాలని వీసా అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. ఈ సమస్యకు వీలైనంత త్వరగా పరిష్కారం లభించాలని ఆశిద్దాం.

### సినిమా ‘షో’

## స్వర్గంలో మరో రోజు స్టార్ కపుల్

కోలీవుడ్ స్టార్ కపుల్ సూర్య, జ్యోతిక ఎప్పుడూ వార్తల్లో ఉంటారు. ప్రేమించి పెళ్లి చేసుకున్న ఈ జోడీ చాలా అన్యోన్యంగా ఉంటారు. పలు సినిమాల్లో హీరోయిన్‌గా నటించిన జ్యోతిక పెళ్లి తర్వాత సినిమాలకు దూరంగా ఉంటూ వచ్చింది. దాదాపుగా దశాబ్ద కాలం పాటు సినిమాలకు పూర్తిగా దూరంగా ఉన్న జ్యోతిక పిల్లలు పెద్ద వారు కావడంతో పాటు, కుటుంబ బాధ్యతలు తగ్గడంతో సినిమాలో రీ ఎంట్రీ ఇచ్చింది. రీ ఎంట్రీలో వరుస సినిమాలు చేస్తూ వచ్చింది. తక్కువ సమయంలోనే ఎక్కువ సినిమాలు చేసింది. ఈ క్రమంలోనే జ్యోతిక ముంబై షిఫ్ట్ అయింది. సూర్య మాత్రం తమిళనాడులో ఉండటంతో అంతా వీరిద్దరి మధ్య గ్యాప్ ఏర్పడింది అంటూ పుకార్లు షికార్లు చేశాయి. బాలీవుడ్ సినిమాల్లో నటించిన జ్యోతికతో సూర్య విభేదాల గురించి జాతీయ మీడియాలోనూ ప్రముఖంగా వార్తలు వచ్చాయి. పిల్లలు ముంబైలో జ్యోతిక వద్ద ఉంటున్నారని, అతి త్వరలోనే వీరిద్దరు అధికారికంగా బ్రేక్ అయ్యే అవకాశాలు ఉన్నాయంటూ



పుకార్లు షికార్లు చేశాయి. ఆ పుకార్లు నిజం కాదని ఎప్పటికప్పుడు వీరిద్దరు చెబుతూ వచ్చారు. అయినా కూడ ఆ పుకార్లు ప్రచారం జరిగేవి. ఈ మధ్య కాలంలో రెగ్యులర్‌గా వీరిద్దరు కలిసి ఉన్న ఫోటోలు, వీడియోలను సోషల్ మీడియాలో చూస్తూ ఉన్నాం. దాంతో ఆ పుకార్లకు చెక్ పెట్టినట్లు అయింది. తాజాగా మరోసారి జ్యోతిక ఒక అందమైన వీడియోను షేర్ చేయడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. సూర్యతో కలిసి తూర్పు ఆఫ్రికాలోని సీషెల్స్ కి జ్యోతిక వెళ్లింది. ఆమె అందుకు సంబంధించిన వీడియోను షేర్ చేసింది. బ్యూటీఫుల్ లొకేషన్స్‌ను జ్యోతిక తన వీడియోలో చూపించింది. అంతే కాకుండా అక్కడ ప్రకృతిని ఆస్వాదిస్తూ, ఫుడ్‌ను ఎంజాయ్ చేస్తూ జ్యోతిక, సూర్యలు టైమ్ స్పెండ్ చేశారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ వీడియో వైరల్ అవుతోంది. నెట్టింట అందరి దృష్టిని ఆకర్షిస్తున్న ఈ వీడియోలో ఇద్దరూ చాలా అన్యోన్యంగా కనిపిస్తున్నారు. కనుక ఇకపై అయినా మీడియాలో ముఖ్యంగా సోషల్ మీడియాలో ఉన్న ప్రచారంకు తెర పడే అవకాశాలు ఉన్నాయి. జ్యోతిక ఆ పుకార్లకు చెక్ పెట్టేందుకు ఇలాంటి వీడియోలను షేర్ చేస్తున్నారా అనే కామెంట్స్ వినిపిస్తున్నాయి.

## దోస్త్ మేరా దోస్త్.. వదిలి క్షణమైనా ఉండలేరు




సమంత రూత్ ప్రభు- కీర్తి సురేష్ స్నేహం గురించి చెప్పాల్సిన పని లేదు. మహానటి%-% చిత్రంలో కీర్తి సురేష్ సావిత్రి పాత్రలో నటించగా, సమంత జర్నలిస్టు పాత్రలో అద్భుతంగా అభినయించింది. ఆ ఇద్దరి నట ప్రతిభకు ప్రపంచం ఫిదా అయిపోయింది. పరిశ్రమలో నాటి నుంచి వారి స్నేహం చాలా ప్రత్యేకమైనదిగా మారింది. అంతేకాదు ఆ ఇద్దరూ హైదరాబాద్ లో ఉన్నా, చెన్నైలో ఉన్నా కలిసే జిమ్ చేస్తుంటారు. జిమ్ యోగా సెషన్స్ కి కలిసే ఎటెండవుతున్నారు. క్లబ్బు, పబ్బు, రెస్టారెంట్, దుబాయ్ పార్టీ, లేదా ఏదైనా ఎగ్జోటిక్ బీచ్ లొకేషన్ లో కలిసి ఎంజాయ్ చేయాలనే ఆలోచన కూడా వారికి ఎప్పుడూ ఉంది. తాజాగా మరోసారి జిమ్ లో కసరత్తులు చేస్తూ, రెస్టారెంట్ లో రుచికరమైన విందు కోసం ఎదురు చూస్తూ ఈ జోడీ కనిపించారు. కలిసి ఫోటోలు దిగి వాటిని సోషల్ మీడియాల్లో షేర్ చేసారు. అభిమానులు ఈ ఫోటోలు చూసిన వెంటనే వారిని క్యూటీస్ అని ముద్దుగా పిలుచుకున్నారు. చాలా మంది వ్యాఖ్యల విభాగంలో హార్ట్ ఈమోజీలను షేర్ చేసారు. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. కీర్తి తదుపరి తెలుగు ఒరిజినల్ చిత్రం ఉప్పు కప్పురంబులో కనిపించనుంది. జూలై 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ విచిత్రమైన సామాజిక వ్యంగ్య చిత్రాన్ని ఎల్లనార్ ఫిల్మ్స్ పతాకంపై రాధిక లావు నిర్మించారు. ఐ.వి. శశి దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో కీర్తి సురేష్, సుహాస్, బాబు మోహన్, శత్రు, తాళ్ళూరి రామేశ్వరి తదితరులు నటించారు.

సమంత రూత్ ప్రభు ఇటీవల విడుదలైన తెలుగు హర్రర్ కామెడీ చిత్రం శుభంతో నిర్మాతగా అరంగేట్రం చేసింది. సొంత బ్యానర్ త్రలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై నిర్మించిన ఈ చిత్రానికి ప్రవీణ్ కాండ్రేగుల దర్శకత్వం వహించారు. హర్షిత్ రెడ్డి, గవిరెడ్డి శ్రీనివాస్, శ్రీయ కొంతం కీలక పాత్రలు పోషించారు.

## దీపికా మొదటి తెలుగు సినిమా కల్కి కాదట

ఇప్పుడు ఎక్కడ విన్నా దీపికా పదుకొణె పేరే. గత కొంతకాలంగా ఆమె పేరు తెగ వినిపిస్తోంది. వర్కింగ్ అవర్స్, రెమ్యూనరేషన్ విషయంలో ఓ భారీ ప్రాజెక్టును వదులుకున్న దీపికా పదుకొణె ఇండస్ట్రీలోకి రాకముందు మోడలింగ్ లో ఉన్న సంగతి అందరికీ తెలిసిందే. అయితే మోడలింగ్ కంటే ముందే దీపికా బ్యాడ్మింటన్ ప్లేయర్ అని చాలా తక్కువ మందికే తెలుసు. దీపికా తండ్రి ప్రకాష్ పదుకొణె ఇండియా తరపున బ్యాడ్మింటన్ ఆడి దేశానికి ఎంతో సేవ చేశారు. తండ్రి ఇన్‌ఫ్లుయెన్స్ తో మొదట బ్యాడ్మింటన్ ఆడిన దీపికా స్టేట్ లెవెల్ కాంపిటీషన్స్ వరకు పార్టిసిపేట్ చేశారు. కానీ తర్వాత మోడలింగ్, సినిమాలపై ఉన్న ఇంట్రెస్ట్ తో బ్యాడ్మింటన్ ను వదిలేసి యాక్టింగ్ వైపు అడుగులేసిన దీపికా సినీ కెరీర్ ఐశ్వర్య అనే సినిమాతో మొదలైంది. ఆ తర్వాత ఎన్నో సినిమాలు చేసిన దీపికా కల్కి సినిమాతో టాలీవుడ్ లోకి ఎంటరయ్యారు. అయితే దీపికా టాలీవుడ్ ఎంట్రీ ఎప్పుడో జరగాల్సింది. జయంత్ సి. పరాన్జీ తీసిన ఓ యూత్‌ఫుల్ లవ్ స్టోరీలో దీపికా ఓ స్పెషల్ సాంగ్ చేశారు. కానీ ఆ మూవీ ఇప్పటికీ రిలీజవక పోవడంతో ఆమె టాలీవుడ్ డెబ్యూ



కల్కితో జరిగింది. కల్కితో ఎంట్రీ ఇచ్చిన దీపికా చేతిలో ఇప్పుడు కల్కి2తో పాటూ అల్లు అర్జున్- అట్లీ కాంబోలో తెరకెక్కబోతున్న మరో తెలుగు సినిమా కూడా ఉంది. రామ్ లీలా షూటింగ్ టైమ్ లో రణ్‌వీర్ సింగ్ తో దీపికా పరిచయం కాస్తా ప్రేమగా మారి తర్వాత వారిద్దరూ పెళ్లి చేసుకుని ఇప్పుడో బిడ్డకు కూడా జన్మనిచ్చారు . రణ్‌వీర్ సింగ్ కంటే ముందు దీపికా రణ్‌బీర్ సింగ్ తో ప్రేమలో ఉన్న సంగతి తెలిసిందే. వేరే అమ్మయితో రిలేషన్ పెట్టుకోవడం వల్లే రణ్‌బీర్ నుంచి విడిపోయానని గతంలో దీపికా ఓ సందర్భంలో చెప్పారు. పెళ్లి తర్వాత కూడా సినిమాల్లో నటిస్తూ వచ్చిన దీపికా, తల్లి అయ్యాక సినిమాల ఎంపికలో మరింత జాగ్రత్తగా ఉంటున్నానని, తన కూతురికి టైమ్ కేటాయించేలా సినీ కెరీర్ ను ప్లాన్ చేసుకుంటున్నట్టు పేర్కొన్నారు. అయితే తన దగ్గరున్న సీక్రెట్స్ ను చెవిలో చెప్పాలంటే ఎవరికి చెప్తారని దీపికాను ప్రశ్నించగా, దానికి ఆమె షారుఖ్ ఖాన్ పేరు చెప్పారు. షారుఖ్, దీపికా కలిసి ఓం శాంతి ఓం, హ్యాపీ న్యూ ఇయర్, చెన్నై ఎక్స్‌ప్రెస్, జవాన్ లాంటి హిట్ సినిమాలు చేశారు. వరుస సినిమాలు చేస్తూ వస్తున్న దీపికా పదుకొణె సినీ రంగంలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారు. ప్రస్తుతం ఆమె ఆస్తుల విలువ రూ.500 కోట్లకు పైగానే ఉంటుంది. ముంబైలో దీపికకు మూడు ఇళ్లు ఉండగా, 2022లో ఆమె సొంతంగా 82%జు% అనే బ్యూటీ బ్రాండ్ ను స్టార్ట్ చేసి సక్సెస్‌ఫుల్ గా రన్ చేస్తున్నారు.

Name of Premises : Venus Enclave, Block - 0, Quthbullapur City, Medchal Malkajgiri District - 500055, email : sanjeevreddyetlapuram@gmail.com. Cell : 8985829417